07032024-DIS-04_Layout 1 3/7/2024 4:12 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## చీకటి పొత్తులు

*దేశంలో* కాంగ్రెస్, బీజేపీ బద్ధశత్రువుల్లా కనిపిస్తాయి. కానీ, రాష్ట్రంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ వాలకమే అందుకు కారణం. ప్రధాని మోదీని ఆయన ఆకాశానికెత్తేశారు. 'బడే భాయ్' అని అభివర్ణించారు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయి. ఆ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని ఎదుర్కొనేందుకు, ఇండియా కూటమి అనే అతుకుల బొంతను కుట్టేందుకు కాంగ్రెస్ నానా తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలో మోదీ ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని రేవంత్ కోరడంలో ఆంతర్యం ఏమిటి? అంటే ఎన్నికల తర్వాత కాంగ్రెస్ దేశంలో పతా లేకుండా పోయి బీజేపీ మళ్లీ గెలవాలని, మోదీ మళ్లీ ప్రధాని కావాలనేది ఆయన ఆకాంక్షగా మనం అర్థం చేసుకోవాల్నా? మరి పాపం రాహుల్‌గాంధీ ఏమైపోవాలి?

కాంగ్రెస్ ముక్త్ భారత్ సాధించాలనుకునే నరేంద్ర మోదీని ఆకాశానికెత్తడం రేవంత్‌కు, ఆయన పార్టీకి ఎలా లాభిస్తుందో తెలియదు. లేక రేవంత్ తన ప్రస్తుత పార్టీ ప్రయోజనాలకతీతంగా మోదీతో స్నేహాన్ని కోరుకుంటున్నారా? ఆయన మరో ఏక్‌నాథ్ షిండే, హిమంత బిశ్వ శర్మ అవుతారని విపక్షాలు విమర్శించడం మనం చూస్తున్నాం. రేవంత్ తీరుతెన్నులను గమనించేవారికి ఇందులో ఏదీ అసాధ్యమని అనిపించదు. మోదీ దోస్తు అదానీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తుంటే రేవంత్ మాత్రం అందుకు భిన్నంగా మాట్లాడుతున్నారు. తెలంగాణలో అదానీ పెట్టుబడులు పెడితే తప్పేమిటని దబాయిస్తున్నారు. ఇక మోదీ, షా పెట్టుబడులతో వస్తే ఆహ్వానిస్తామని అనడం రేవంత్‌కే చెల్లింది. కాంగ్రెస్, బీజేపీలకు బీఆర్ఎస్ పొడ గిట్టదు. పొద్దున లేస్తే కారు పార్టీపై నోరు పారేసుకోందే మనసుకు పట్టదు. ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే బీఆర్ఎస్ అంటే తెలంగాణ ప్రజలకు అభిమానం ఎక్కువ. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు మధ్య ఓట్ల శాతంలో తేడా రెండు శాతమే ఉండటం ఇందుకు నిదర్శనం. ప్రజల హృదయాల నుంచి బీఆర్ఎస్‌ను తుడిచేయాలన్న అక్కసుతో రెండు ఢిల్లీ పార్టీలు చీకటి ఒప్పందం ఏదైనా చేసుకున్నాయా? అనే సందేహాలు తలెత్తడం సహజం.

కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎన్నోరంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ మాడల్‌కు ఓ బ్రాండ్ వ్యాల్యూ వచ్చింది. ఈ మాడల్‌ను అధ్యయనం చేసేందుకు కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు, ఇతర దేశాలు సైతం బృందాలను పంపించడం తెలిసిందే. తెలంగాణతో పోలిస్తే ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ ఓ విఫల మాడల్ అని రాజకీయ విశ్లేషకులు తేల్చారు. కానీ, గుజరాత్ మాడల్‌ను అనుసరిస్తామని సీఎం రేవంత్ చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రధానిని ప్రసన్నం చేసుకునేందుకు వేసిన ధూపమని అనుకోవాలా? తర్వాత కూడా ఈ ధోరణిని రేవంత్ సమర్థించుకోవడం హాస్యాస్పదం. గుజరాత్ తరహాలో తెలంగాణకూ భారీ ప్రాజెక్టులు మంజూరు చేయమని కోరినట్టు చెప్పడం మరీ విడ్డూరం. ప్రధాని మోదీకి తెలంగాణ మీదున్న ప్రేమ ఏపాటిదో తెలియంది కాదు. అసలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం మీదే ఆయన ఎన్నో సందర్భాల్లో విషం చిమ్మారు. అలాంటి వ్యక్తి నుంచి తెలంగాణకు వరాలు సాధిస్తానని అనుకోవడం అత్యాశే.

# ట్రిబ్యునళ్ల తీరుతోనే నీటి కష్టాలు

**"వందల నదులకు భారత్ పుట్టినిల్లు. అందుకే మన దేశాన్ని నదుల దేశంగా కూడా పిలుస్తారు. సింధు నుంచి కావేరి వరకు.. మొత్తం 400కు పైగా చిన్న, మధ్య తరహా, భారీ నదులు మన దేశంలో ఉన్నాయి. కానీ, గుక్కెడు నీటి కోసం తండ్లాట తప్పడం లేదు. బెంగళూరు, చెన్నై, ఢిల్లీ లాంటి నగరాలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ దుస్థితికి ప్రధాన కారణం ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవడమే. కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులను నిర్మించకపోవడమే. ప్రభుత్వాలు మారుతున్నా, విధానాలు మారుతున్నా నీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. రాష్ట్రాల మధ్య జల వివాదాలకు పరిష్కారం దొరకడం లేదు."**

కన్నోజు శ్రీహర్ష
89851 30032

దేశ అవసరాలకు సరిపడా నీళ్లున్నా.. జల వివాదాల కారణంగా కొన్ని ప్రాంతాలు కరవు సీమలుగా మారుతుండటం బాధాకరం. జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వాలు నియమిస్తున్న ట్రిబ్యునళ్లు కోరలు లేని పులుల్లా మారిపోయాయి. ఇప్పటివరకు ఏ ఒక్క సమస్యను ట్రిబ్యునళ్లు పరిష్కరించకపోవడమే అందుకు నిదర్శనం.

ట్రిబ్యునల్ వ్యవస్థ పాక్షిక న్యాయ వ్యవస్థగా పని చేస్తుంది. రాష్ట్రాల మధ్య జల వివాదాలు తలెత్తినప్పుడు వీటిని కేంద్రం ఏర్పాటు చేస్తుంది. 262 అధికరణం ప్రకారం.. ట్రిబ్యునళ్లను నియమించే అధికారం పార్లమెంట్‌కు రాజ్యాంగం కల్పించింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 ప్రకారం.. రెండు లేదా మూడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల జగడాలను ఇవి పరిష్కరించాలి. కానీ, నేటి వరకు ఒక్క వివాదాన్ని కూడా ట్రిబ్యునళ్లు పరిష్కరించిన పాపానపోలేదు.

మన దేశంలో ఇప్పటి వరకు 8 ట్రిబ్యునళ్లు ఏర్పాటయ్యాయి. గోదావరి, కృష్ణా, వంశధార, బియాస్, కావేరి, మహదాయి నదులకు సంబంధించి జల వివాదాల పరిష్కారం కోసం ఆయా ట్రిబ్యునళ్లను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కావేరి జల వివాదాన్ని పరిష్కరించడంలో ట్రిబ్యునల్ విఫలమవడంతో కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాలు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. కోర్టు ఆదేశాలతో 15,000 క్యూసెక్కుల నీరు తమిళనాడుకు వదిలారు. రావి-బియాస్ నదుల వివాదం హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల మధ్య చిచ్చురేపింది. ఈ వివాదం తారస్థాయికి చేరింది. కృష్ణా జలాలను పంపిణీ చేయడంలో ట్రిబ్యునళ్లు విఫలమవడంతో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల వివాదాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. నర్మదా నది వివాదం కారణంగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నర్మదా ప్రాజెక్టు పూర్తవడానికి దాదాపు 30 ఏండ్లు పట్టింది. ఈ విధంగా దేశంలో అనేక వివాదాలు చెలరేగుతున్నా ట్రిబ్యునళ్ల తీరు మారడం లేదు. జల వివాదాలను పరిష్కరించాలనే ధ్యాసే లేకుండాపోయింది. అనుమతులు, ఇతర రాష్ట్రాల పేచీల కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ప్రాజెక్టులను నిర్మించేందుకు జంకుతున్నాయి. తత్ఫలితంగా దేశంలో నీటి లభ్యత ఉన్నా.. సాగు, తాగునీటి కోసం కష్టాలు తప్పడం లేదు.

> **మన దేశంలో ఏటా సగటు వర్షపాతం 900 సెంటీమీటర్లకు పైనే ఉంటుంది. రిజర్వాయర్లు, కాలువలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు లేకపోవడంతో 70,000 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నది. నీటి లభ్యత ఉన్నప్పటికీ, పక్కనే నదులు పారుతున్నా పొలాలకు నీటిని పారించుకోలేని దుస్థితిని మన తెలంగాణ అప్పట్లో ఎదుర్కొన్నది. నేడు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. 2050 నాటికి భారత్‌లో తీవ్రమైన కరువు సంభవిస్తుందని యూఎన్‌డీపీ, డబ్ల్యూఆర్ఐ తదితర అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.**

కేంద్రీకృత వ్యవస్థ వల్ల రాష్ట్రాల స్వేచ్ఛను హరిస్తున్నాయని ట్రిబ్యునళ్లపై ఒక ఆరోపణ ఉన్నది. ఇది ప్రధానమైన సమస్య. రాష్ట్రాల మధ్య సఖ్యత కోసం ట్రిబ్యునళ్లు, కేంద్ర ప్రభుత్వాలు ఏనాడూ కృషి చేయలేదు. అధికారుల లోటు, రాజకీయ ఒత్తిడి కారణంగా జల వివాదాలు ఏటికేడు పెండింగ్ పడుతూనే ఉన్నాయి. సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలను పరిగణనలోకి తీసుకోకపోవడం, నదీ జలాల బోర్డు సభ్యులతో సఖ్యత లేకపోవడం తదితర అంశాలు జల జగడాలను మరింత జటిలం చేస్తున్నాయి. ఈ విధంగా అనేక కారణాల వల్ల నీరు వృథాగా పోతున్నది. రాష్ట్రాలు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కుంటలు, చెరువులు, వాగులను పునరుద్ధరించి నీటి లభ్యతను పెంచేందుకు రాష్ట్రాలు కృషి చేయాలి. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రాన్ని, కేసీఆర్ విజన్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. ఎత్తైన పీఠభూమిపై ఉన్న రాష్ట్రాలు తక్షణమే కాళేశ్వరం లాంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులను చేపట్టాలి. గంగా-కావేరి నదులను అనుసంధానం చేయాలి. నీటిపారుదల రంగంపై భారీగా మూలధన పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటికి తాగునీరు అందించే బృహత్తర ప్రణాళికలను చేపట్టాలి. ఆయా రాష్ట్రాలు సఖ్యతతో నదీ జలాల మళ్లింపుపై దృష్టి సారించాలి. అందుకు పాలకులు, ప్రభుత్వాలు చొరవ చూపాలి. ఈ విధంగా చేసినట్లయితే జల జగడాలకు చోటు ఉండదు. ట్రిబ్యునళ్ల తీర్పులు ఆలస్యం అయినప్పటికీ రాష్ట్రాల మధ్య సఖ్యతతో సాగు, తాగునీరు అవసరాల కోసం నదీ జలాలను ఉపయోగించుకోవచ్చు.

అదే సమయంలో ట్రిబ్యునళ్ల వ్యవస్థలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉంది. కేంద్రీకృత విధానాలను కాకుండా ఆయా వివాదాలు నెలకొన్న రాష్ట్రాల సభ్యులను నియమించాలి. పారదర్శకంగా నీటి కేటాయింపులు జరపాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లీ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాల్సిన అవసరం లేకుండా ట్రిబ్యునళ్లు వివాదాలను పరిష్కరించాలి. నదీ జలాల పంపకాల కోసం హెల్సింకి నియమాలను పాటించాల్సిన అవసరం ఉంది. నదీ జలాల వివాదాల చట్టాన్ని సైతం సవరణ చేయాలి. సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తేనే దేశంలో జల జగడాలు పరిష్కారం అవుతాయి. తద్వారా తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయి.

## పేదరికం తగ్గిందా?

గడిచిన దశాబ్దకాలంలో 5 శాతం మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని కేంద్ర ప్రభుత్వం ఇటీవల గొప్పగా ప్రకటించింది. 2011-12 కుటుంబ వినిమయ వ్యయ సర్వేతో పోలుస్తూ.. నీతి ఆయోగ్ తన నివేదికలో ఈ విధంగా పేర్కొంది. కానీ, 2011-12 సర్వేలోని ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోకుండా.. ప్రస్తుత ఆదాయం, ఋణాలు, ప్రభుత్వ ఉచిత పథకాల ఆధారంగా పేదరికం తగ్గిందని ప్రకటించడం గమనార్హం. ఈ విధానం ఏ మాత్రం సమంజసం కాదని ఆర్థికవేత్తలు చెప్తున్నారు. దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, అధిక ధరలు.. పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుంటే 'పేదరికం తగ్గింది' అని బీజేపీ సర్కార్ గొప్పలకు పోవడం ఏమిటని ప్రజలు కూడా ప్రశ్నిస్తున్నారు.

ముఖ్యంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ లేనివిధంగా ఈ మధ్యకాలంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ఏటా లక్షల మంది యువత డిగ్రీ, బీటెక్ పట్టాలు తీసుకొని జాబ్ మార్కెట్లోకి అడుగుపెడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక కోట్ల మంది నిరుద్యోగులు రోడ్ల వెంట తిరుగుతున్నారు. ఆకలికి అలమటిస్తున్నారు. ఈ వాస్తవాలను విస్మరిస్తున్న కేంద్రం పేదరికం తగ్గిందని చెప్పడం హాస్యాస్పదం. విగ్రహాలు నిర్మిస్తూ, సామాన్యులకు అందుబాటులో లేని వందేభారత్ రైళ్లను ప్రవేశపెడుతూ.. ఇదే అభివృద్ధి అని ప్రజలను పాలకులు మభ్యపెడుతున్నారు. త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరిస్తుందని చెప్పూ పేదరికంపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ప్రజల కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కూడా లేకుండా కోట్ల మంది భారతీయులు ఇప్పటికీ దీనావస్థలో బతుకుతున్నారు. అందువల్లనే అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. రేషన్ బియ్యం అందిస్తున్నాయి. వాస్తవానికి ప్రజలు పేదరికం నుంచి బయటపడితే ఉచిత, సంక్షేమ పథకాలు తగ్గాలి కదా! మరి రోజురోజుకు పెరగడం ఏమిటి?

నిజంగా పేదరికం తగ్గితే వలసలు ఆగాలి కదా? రోజురోజుకు అంతర్గత, అంతర్జాతీయ వలసలు పెరగటం దేనికి సంకేతం? కనీసం తాగునీరు కూడా దిక్కులేని ఆవాసాలు నేటికీ అనేక రాష్ట్రాల్లో కనిపిస్తుండటం విచారకరం. ఇప్పటికీ గిరిజనులు డోలీలను ఆధారం చేసుకొని ప్రయాణిస్తున్నారు. విద్యుత్తు సరఫరాకు నోచుకోక లక్షల ఇండ్లు అంధకారంలోనే మగ్గుతున్నాయి. ఆకలి సూచీలో మన స్థానం ఏంటో అందరికీ తెలుసు. నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోల్ ధరలు ఎలా మండుతున్నాయో.. ఆ మంటల్లో మన వేతనాలు ఎలా కరిగిపోతున్నాయో పాలకులకు తెలియడం లేదా? కేవలం సెన్సెక్స్ నిఫ్టీ సూచీలు రికార్డు స్థాయిలో రాణించడం, ప్రతీ నెలా రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు నమోదైతే దేశం అభివృద్ధి చెందినట్టా? 'మేడిపండు చూడ మేలిమై ఉండు' అన్నట్టు ఉంది మన దేశ ఆర్థిక పరిస్థితి. పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయో ఇకనైనా పాలకులు గ్రహించాలి. ప్రభుత్వ అనుకూల సంస్థల లెక్కలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాన్ని తెలుసుకోవాలి.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లోనూ వ్యవసాయ రంగానికి తక్కువ నిధులు కేటాయించారు. రాయితీలపై కోత విధించారు. ఉన్నత విద్యా రంగానికి కేటాయింపులు అంతంతమాత్రమే. ప్రత్యేకించి యూజీసీకి 60 శాతం మేర నిధులు తగ్గించారు. నేటికీ మన దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముక వ్యవసాయ రంగమే. అటువంటి రంగానికి నిధుల్లో కోత విధించడం ఆందోళనకరం. దేశ రాజధానిలో తమ న్యాయపరమైన హక్కుల కోసం రైతులు అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. వారి ప్రధాన డిమాండ్ అయిన కనీస మద్దతు ధరకు నేటికీ మోదీ సర్కార్ భరోసా ఇవ్వడం లేదు. దీన్నిబట్టే రైతులకు పాలకులు ఇస్తున్న ప్రాధాన్యం ఏంటో అర్థం చేసుకోవచ్చు.

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఇప్పటికైనా రైతులు, దేశ ప్రజలు వాస్తవాలను గ్రహించాలి. సామాన్యులు, రైతులు, యువత ఆశయాలను నెరవేర్చే పార్టీలకు ప్రజలు అండగా నిలవాలి. ఓటును సద్వినియోగం చేసుకోవాలి. పేదరికం లేని భవిష్యత్తు భారత్‌ను నిర్మించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడే వారికి అండదండలు అందించాలి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడేవారి పక్షాన నిలబడాలి. అప్పుడే రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతిరూపంగా నవ భారత్ ఆవిష్కరిస్తుంది.

ఐపీ రావు
63056 82733

**లేఖ**

## టెట్ నిర్వహించండి..

టీచర్ కావాలనే ఏకైక లక్ష్యంతో డీఎడ్, బీఎడ్ పూర్తిచేసిన యువత కలలపై రాష్ట్ర సర్కార్ నీళ్లు చల్లింది. టెట్ నిర్వహించకుండానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టెట్‌కు వివిధ కారణాల వల్ల అనేకమంది గైర్హాజరయ్యారు. 2 లక్షల మంది దాకా అర్హత సాధించలేదు. వారితో పాటు కొత్తగా ఉత్తీర్ణులైనవారితో కలిపి సుమారు 4 లక్షల మంది టెట్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రజాపాలన అంటూ చెప్పుకొంటున్న రేవంత్ సర్కార్ వాళ్ల ఆశలపై నీళ్లు చల్లింది. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2011లో టెట్ నిర్వహించింది. మళ్లీ 2012లో మరోసారి టెట్ జరగగా, అదే ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదలైంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక 2016లో మరోసారి టెట్ జరిగింది. ఆ తర్వాత 2017లో టెట్ నిర్వహించి.. టీఆర్‌టీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఐదేండ్ల తర్వాత 2022 జూన్‌లో టెట్ పరీక్ష నిర్వహించారు. 2023 ఆగస్టులో టెట్ నోటిఫికేషన్ ఇచ్చి సెప్టెంబర్ 15న పరీక్ష నిర్వహించారు. పేపర్-1కు 2,23,582 మంది హాజరయ్యారు. వారిలో 82,489 (36.89 శాతం) మంది మాత్రమే అర్హత సాధించారు. పేపర్-2కు 1,90,047 అభ్యర్థులు హాజరవగా.. 29,073 (15.30 శాతం) మంది అర్హత సాధించారు. తాజాగా కాంగ్రెస్ సర్కార్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ, టెట్ నిర్వహణను గాలికి వదిలేసింది. మొదట టెట్ నిర్వహించి ఆ తర్వాత డీఎస్సీ నిర్వహిస్తే మాలాంటి ఎంతో మంది నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతుంది.

**- ఎన్.హరీశ్**

# మూన్నెళ్ల ముచ్చట

గడ్డం సతీష్
99590 59041

**'ఎనుముల రేవంత్ రెడ్డి అనే నేను...' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి నేటితో మూడు నెలలు పూర్తయ్యాయి. రాష్ట్ర గవర్నర్ సమక్షంలో, ప్రజాస్వామ్య బద్ధంగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాలని, ఆ కుర్చీని అధిష్ఠించాలని ప్రతీ రాజకీయ నాయకుడూ కోరుకుంటాడు. కానీ, ఆ కలను నెరవేర్చుకోవడంలో కొందరే సఫలీకృతమైతే, ఇంకొందరు వెనుక బడిపోతారు.**

'కాంగ్రెస్ పార్టీలో 'భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకుల తలలు పండుతున్నా, వారి కల మాత్రం ఇంకా పండటం లేదు. అలాంటి నాయకులు ఆ కుర్చీ అంచును కూడా తాకలేకపోతున్నారు. వారి సంగతి పక్కనపెడితే 'ముఖ్యమంత్రి' కుర్చీని దక్కించుకోవడంలో సఫలీకృతమైన కొందరు నాయకులు ప్రజలకు సంక్షేమ పాలనను అందించడంలో, ప్రజలు కోరుకున్న 'మార్పు'ను చేసి చూపించడంలో విఫలమవుతున్నారు. అయితే ఈ మూడు నెలల కాలంలో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఏం సాధించారో అవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అందులో భాగంగానే ఈ వ్యాసం...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ వేదికగా కొనియాడారు. వైఎస్ ప్రవేశపెట్టిన 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకాన్ని తమ ప్రభుత్వం అలాగే కొనసాగిస్తుందని బల్లగుద్ది ప్రకటించారు. నిజానికి వైఎస్‌ఆర్ ప్రత్యేక తెలంగాణకు బద్ధ వ్యతిరేకి. అయినా ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం ఆగలేదు. దీనివెనుక ఎవరి కృషి ఉన్నదో నాటి ఏ ఉద్యమ నాయకులనడిగినా చెప్తారు. వైఎస్‌ను కేసీఆర్ ఏనాడూ శత్రువుగా చూడలేదు. వైఎస్ ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని కీర్తించారు. ఇతర నాయకులు ప్రవేశపెట్టిన మంచి పథకాలను అలాగే కొనసాగిస్తామని అసెంబ్లీలో ప్రకటించాలంటే ఏ నాయకుడికైనా గుండె నిండా దమ్ముండాలి. అన్నింటికి మించి మంచి మనస్సుండాలి. అది ఉంది కాబట్టే నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని కొనసాగించడమే కాదు, దానితో ప్రజలకు ఒనగూడే ప్రయోజనాలను విస్తృతపరిచి ప్రజల మెప్పు పొందారు. ఒక్క కేసీఆరే కాదు, ప్రజల శ్రేయస్సు కోసం, ప్రజల బాగోగుల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే ఏ నాయకుడైనా ఇదే చేస్తారు. ఒక్క రేవంత్‌రెడ్డి తప్ప. అవును, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రిగా ఏం చేయకూడదో అదే చేసి ఆదిలోనే తప్పులో కాలేశారు.

> **శివుడి శిరస్సు నుంచి గంగ కిందకు దుంకుతున్నదనే విషయం అందరికీ విదితమే. కానీ ఆ బోళా శంకరుడి శిరస్సు మీదికే గంగను ఎత్తిపోయవచ్చని నిరూపించిన బృహత్తరమైన ప్రాజెక్టు కాళేశ్వరం. అలాంటి ప్రాజెక్టు మీదికి ఎన్నో అపప్రథలను మూటగట్టి విసిరేయజూస్తున్నారు మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.**

సీఎం రేవంత్ కుత్సిత బుద్ధి వెనుక అపర భగీరథుడైన కేసీఆర్‌ను ప్రజల్లో పలుచన చేయాలనే కుట్ర దాగి ఉన్నదనే విషయం ప్రస్ఫుటంగా కనపడుతున్నది. ఈ క్రమంలో ఏ ప్రజలైతే మార్పును కోరుకున్నారో ఆ ప్రజలనే ముఖ్యమంత్రి రేవంత్ మరిచిపోవడం బాధాకరం. గత ఐదారేండ్లుగా ఎండకాలంలోనూ మత్తళ్లు దుంకిన చెరువులు ఫిబ్రవరిలోనే నెర్రెలు బారాయి. ఇంకేముంది పాత రోజులు మళ్లీ వచ్చాయంటూ ప్రజలు ఏకరువు పెడుతున్నారు. ఎండిపోతున్న పంటలను చూడలేక ట్యాంకర్లతో పంటలకు నీరు పెడుతున్నారు. సాగునీటి సంగతి దేవుడెరుగు తాగునీటికే కటకట మొదలైందంటూ ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు. మన ఆడబిడ్డలు బిందెలను పట్టుకొని రోడ్డెక్కుతున్నారు. నాడు ఎరువుల కరువు తీరిందని సంబురపడిన కర్షకులు మళ్లీ చెప్పులను క్యూలో పెడుతుండటం నిజంగా బాధాకరం.

'ఏ దొడ్లో కడితే ఏమిటీ, మా దొడ్లో ఈనితే చాలు' అనుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీచేసిన ఉద్యోగ నియామక పత్రాలందజేస్తుండటాన్ని చూసి యువత నవ్వుకుంటున్నది. మళ్లీ 'గ్రూప్-1' అని గొప్పలకు పోతున్నా... మెగా డీఎస్సీ అంటూ నీటిమీద రాతలు రాస్తున్నా... లక్షలాది మంది నిరుద్యోగుల్లో నిరాశా నిస్పృహలు ఇంకా కనపడుతున్నాయి. బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన దాదాపు మూడు లక్షల మంది నిరుద్యోగులు మాకు టెట్ రాసే అవకాశం ఇవ్వకుండా డీఎస్సీ ఎట్లా ప్రకటిస్తారని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తుండటం గమనార్హం. ఇక 'రైతు భరోసా'గా మారిన రైతుబంధు విషయానికి వస్తే... ఎకరానికి ఏటా రూ.15 వేలేమో కానీ, పసలుకు పది రూపాయలు కూడా పడపనే నిరాశ రైతుల్లో అమాంతం పెరిగింది. అప్పటి ప్రభుత్వం కట్టిన ప్రీమియం కారణంగా ఎల్ఐసీ ద్వారా రైతు బీమా ప్రస్తుతానికి సజావుగానే నడుస్తున్నది. పాలసీ గడువు ముగిసిన తర్వాత వచ్చే ఆగస్టు నెల నుంచి ప్రస్తుత ప్రభుత్వం 'రైతు బీమా' కొనసాగించడం మీద రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ఈసమెత్తు బంగారం గానీ కల్యాణలక్ష్మి డబ్బులు గానీ ఇవ్వడం లేదు.

> **ఇక్కడ 'మార్పు' గురించి ప్రత్యేకంగా చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అయితే రాష్ట్రంలో 'మార్పు' మొదలై మూడు నెలలు పూర్తయింది. అయినా ఇప్పుడు మా బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని ఏకరువు పెడుతున్నది పల్లె ప్రజానీకం.**

అయితే ఎంతసేపూ కుర్చీ కాపాడుకోవడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ, హైదరాబాద్ చుట్టూరా ప్రదక్షిణలు చేస్తున్నారు తప్ప మా పల్లెలకు మాత్రం రావడం లేదని ప్రజలు లబోదిబోమంటున్నారు. ఏదేమైనా గత మూడు నెలల కాలంలోని రేవంత్ పాలన రాష్ట్ర ప్రజలకు మూడు చెరువుల నీళ్లు తాగించింది. రాష్ట్ర ప్రజలు ఈ మూడు నెలలు పయనించింది ముండ్లబాటలోనే అనడంలో అతిశయోక్తి లేదు.




## నా బోరూ ఎండిపోయింది

*కర్ణాటక ఇప్పుడు విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొన్నది. మరీ ముఖ్యంగా రాజధాని నగరం బెంగళూరులో సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నది. నగరంలోని అన్ని బోర్లు ఎండిపోయాయి. నా ఇంట్లో ఉన్న బోరు కూడా ఎండిపోయింది. రూ.500కే లభించే ట్యాంకర్ నీటిని రూ.5000కు అమ్ముతున్నట్టు మా దృష్టికి వచ్చింది. ప్రజలకు తక్కువకే నీరు అందేలా చర్యలు చేపడతాం.*

**-